క్లుప్తంగా

కోదండరాంకు సన్మానం



కోదండరాంను సన్మానిస్తున్న అశోక్

భీమారం: ఎమ్మెల్సీగా ఎన్నికైన ప్రొఫెసర్ కోదండరాంను రాష్ట్రగొర్రెలు, మేకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్ శనివారం హైదరాబాద్‌లో శాలువా కప్పి సన్మానించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. విద్యావేత్త అయిన కోదండరాం హయాంలో విద్యారంగం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం నుంచి ఎదిగిన కోదండరాం కు మంత్రి పదవి ఇవ్వాలని కోరారు.

స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోండి

బెల్లంపల్లి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు స్కాలర్‌షిప్ మంజూరు కోసం వెంటనే దరఖాస్తు చేసుకోవాలని బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీఎస్ ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీతో స్కాలర్ షిప్‌కు దరఖాస్తు చేసే తుది గడువు ముగుస్తుందని తెలిపారు. ఇదే చివరి అవకాశంగా విద్యార్థులు గుర్తించాలని పేర్కొన్నారు. కళాశాల విద్యార్థులు ఇప్పటి వరకు 416మంది దరఖాస్తు చేసుకోగా మరో 230మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉందని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకో వాల్సి ఉంటుందని, సాంకేతిక సమస్యలు ఉత్పన్నం కాకముందే విద్యార్థులు అప్రమత్తం కావాలని సూచించారు. స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోకపోతే సంబంధిత డిగ్రీకి సంబంధించిన ఫీజులను ఆ విద్యార్థులు కళాశాలకు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. నిర్లక్ష్యం వీడి వెంటనే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

రెడ్‌క్రాస్ సభ్యుల చిరునామా మార్పులకు అవకాశం

మంచిర్యాలటౌన్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ అధ్యక్షుడు, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోశ్ ఆదేశాల మేరకు జిల్లా రెడ్‌క్రాస్ సభ్యులు వారి సభ్యత్వం పొందిన చిరునామాలో ఏమైనా మార్పులు ఉంటే చేసుకోవాలని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ కార్యాలయంలో వచ్చే నెల 5వ తేదీ వరకు మార్పులు చేసుకునేందుకు అవకాశం ఉందని, సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జనవిజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ టెస్ట్

మంచిర్యాలఅర్బన్: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలస్థాయి చెకుముకి సైన్స్ టెస్ట్ నిర్వహించారు. జిల్లా డీఎస్‌వో మధుబాబు ప్రశ్నపత్రం రిలీజ్ చేసి పరీక్ష ప్రారంభించారు. మండల స్థాయి పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చటంతో మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, మిమ్స్ హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టయ్య తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భీమారం: మండలంలోని 11గ్రామపంచాయతీల్లో ఆదివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ కుమార్ శనివారం తెలిపారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నట్లు, ఈ నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. ప్రజలు సహకరించాలని ఏఈ కోరారు.

దుప్పట్లు పంపిణీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రెడ్డి మహిళ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం హాజీపూర్ మండలం ర్యాలీ గ్రామ పంచాయతీలోని కొలాంగూడ తాండా గిరిజనులకు బ్రెడ్, పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు గోనె మణిమాల, నరెడ్ల స్వాతి, సీహెచ్.రేణుక, పి.రమ, సీహెచ్.రమ, బి.రాణి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

భీమారం: మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసస్ అసోసియేషన్(ట్రెస్సా) ప్రచురించిన క్యాలెండర్లతో పాటు డైరీలను తహసీల్దార్ విశ్వంబర్ విడుదల చేశారు. ఈ మేరకు తహసీల్దార్ మాట్లాడుతూ.. రెవెన్యూ శాఖ ద్వారా మెరుగైన సేవలు అందిస్తున్నామని తెలపారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

- వాహనదారులకు అవగాహన కల్పించిన అధికారులు, పోలీసులు

భీమిని: మండల కేంద్రంలో శనివారం భీమిని ఎస్సై ప్రశాంత్ ఆధ్వర్యంలో వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు జనవరి 14 నుంచి ఫిబ్రవరి15వరకు రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు సేఫ్టీ గురించి ప్రతిఒక్కరూ తప్పనిసరిగా తెలుసుకోవాలని, వాహనదారులు రూల్స్ పాటించాలని లేనట్లయితే ఇతరులకు నష్టం వాటిల్లి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

తాండూర్: వాహనదారులు ప్రతి ఒక్కరూ విధిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని తాండూర్ ఎస్సై రాజశేఖర్, ఎంవీఐ యోగేశ్వర్‌సింగ్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని శనివారం వాహనదారులు, ఆటో డ్రైవర్లకు రోడ్డుప్రమాదాలపై అవగాహన కల్పించి, పోస్టర్లు ఆవిష్కరించారు. రోడ్డు భద్రత గురించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సరైన రక్షణ చర్యలు తీసుకోకుండా వాహనాన్ని నడపొద్దన్నారు. అతివేగం, అజాగ్రత్తగా వాహనం నడపడం వల్లనే అధిక సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. తాండూర్ మండల పరిధిలో గతేడాది 12రోడ్డు ప్రమాదాలు జరగ్గా నలుగురు చనిపోయారని, 8మంది గాయాల పాలయ్యారని వివరించారు. ఏఎస్సై లక్ష్మణ్, పోలీసు సిబ్బంది, డ్రైవర్లు, వాహనదారులు పాల్గొన్నారు.



తాండూర్: పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్సై, ఎంవీఐ



లక్సెట్టిపేట: ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్టీఏ అధికారులు



భీమినిలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై ప్రశాంత్

లక్సెట్టిపేట: మండల కేంద్రంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆర్టీఏ అధికారులు రోడ్డు ప్రమాదాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నియమ నిభంధనలు పాటించాలని సూచించారు. ఏఎంవీఐ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

రామకృష్ణాపూర్: ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని పట్టణ ఎస్సై రాజశేఖర్ సూచించారు. క్యాతనపల్లి రైల్వే గేట్ వద్ద శనివారం ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ ధరించని వారికి జరిమానాలు విధించడంతో పాటు హెల్మెట్ ధరించిన వాహనదారులను అభినందిస్తూ గులాబీ పువ్వులు అందజేశారు.

ఘనంగా టీబీజీకేఎస్ ఆవిర్భావ వేడుకలు

శ్రీరాంపూర్: సింగరేణిలో అనేక హక్కులు సాధించి టీబీజీకేఎస్ కార్మికుల్లో చెరగని ముద్ర వేసుకుందని టీబీజీకేఎస్ ఏరియా చర్చల ప్రతినిధి పెట్టం లక్ష్మణ్, బ్రాంచి కార్యదర్శి పానుగంటి సత్తయ్య తెలిపారు. యూనియన్ ఆవిర్భావ వేడుకలను ఆదివారం నస్పూర్ కాలనీలోని ఆ యూనియన్ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి అనంతరం జెండా ఎగరవేసి కేక్ కట్ చేశారు. కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2003జనవరి 27న ప్రొఫెసర్ జయశంకర్ సార్ చేతుల మీదుగా యూనియన్ ఆవిర్భావం జరిగిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన తాము తెలంగాణ సాధించిన తర్వాత గుర్తింపు సంఘంగా గెలిచి కార్మికులకు చరిత్రలో నిలిచిపోయే హక్కుల సాధించి పెట్టామన్నారు. జాతీయ సంఘాలు పోగొట్టిన హక్కులను కూడా తిరిగి తీసుకొచ్చామన్నారు. తమ హయాంలోనే 18వేల మందికి ఉద్యోగాలు కల్పించిన ఘనత తమ సంఘానిదేనన్నారు. సింగరేణిలో కార్మికుల నుంచి టీబీజీకేఎస్‌ను ఎవరు దూరం చేయలేరన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి తొంగల రమేష్, నాయకులు సాదుల భాస్కర్, ఆకునూరి సంపత్, రత్నాకర్ రెడ్డి, రాజు నాయక్, నారాయణ, బెడ్డ శ్రీనివాస్, ఉత్తేజ్ రెడ్డి, మేడం తిరుపతి, మల్లేశం పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు

లక్సెట్టిపేట: మండలంలోని దౌడపల్లి గ్రామానికి చెందిన గాగిరెడ్డి లక్ష్మారెడ్డి ఇటీవల మృతిచెందడంతో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు శనివారం పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో ఆయన వెంట మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

'కేటీఆర్ వ్యాఖ్యలు ఖండిస్తున్నాం'

పాతమంచిర్యాల: తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాంను ఎమ్మెల్సీగా ఎలా చేస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ జనసమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ బాబన్న, జిల్లా అధ్యక్షుడు రాంచందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కోదండరాంను కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యబద్ధంగా ఎమ్మెల్సీగా ఎన్నుకుని గౌరవించిందన్నారు. అలాంటి కాంగ్రెస్‌ను అభినందించాల్సి పోయి విమర్శించడం తగదన్నారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి యువజన సమితి జిల్లా అధ్యక్షులు బచ్చలి ప్రవీణ్‌కుమార్, సిరాజ్ ఉన్నారు.

కాసిపేట: అధికారం పోవడంతో కేటీఆర్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని తెలంగాణ ఉద్యమకారులు, కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమగూడెంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇకనైనా పద్ధతి మార్చుకోనట్లయితే, ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుడు దుర్గం గోపాల్, కాంగ్రెస్ నాయకులు గుమాస భీమయ్య, దూడం మహేష్, శ్రీరాముల చిలకయ్య, దాసరి రాంచందర్, బొడ్డు శంకర్, దోంతమల్ల సత్యనారాయణ, తెలంగాణ ప్రజాఫ్రంట్ నాయకులు గోనెల శ్రీనివాస్, శ్రీలత తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఉద్యమకారులు, నాయకులు

భూసార పరీక్షలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మందమర్రిరూరల్: మందమర్రి మండలంలోని సారంగపల్లిలో భూసార పరీక్షపై శనివారం రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొ.జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, పొలాస, జగిత్యాల ప్రతినిధి ముత్యం తిరుపతి హాజరై భూసార పరీక్ష ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రతి మూడు పంటలకు ఒకసారి భూసార పరీక్ష చేయించుకోవాలని సూచించారు. భూసార పరీక్షల ద్వారా ఎక్కువ దిగుబడి వచ్చే పంటలు వేసి లాభాలు పొందొచ్చన్నారు. అనంతరం రైతుల భూముల్లోని మట్టిని పరీక్షించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల కృషి అనుభవ కార్యక్రమ విద్యార్థులు సుమన్, వెంకటేష్, రైతులు ఉన్నారు.

బీసీలకు అవకాశం కల్పించకపోవడం శోచనీయం

పాతమంచిర్యాల: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పదవుల్లో బీసీలకు అవకాశం కల్పించకపోవడం శోచనీయమని బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్మభూమినగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి సలహాలు ఇచ్చే స్థాయి బీసీలకు లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వలేదని, మంత్రివర్గంలో కూడా పెద్దగా అవకాశాలు కల్పించలేదని తెలిపారు. హైకోర్టు అడ్వకేట్ జనరల్‌గా, అడిషనల్ హైకోర్టు అడ్వకేట్ జనరల్‌గా బీసీలకు అవకాశం కల్పించకపోవడం బాధాకరమని తెలిపారు. ఈ సమావేశంలో బీసీ సంఘాల ఐక్య వేదిక జిల్లా నాయకులు శ్రీపతి రాములు, అంకం సతీష్, గుండా రాజమల్లు, నీలం రవి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుమ్ముల శ్రీనివాస్

ఆర్థికసాయం అందజేత

దండేపల్లి: మండలంలోని మామిడిపల్లికి చెందిన కస్తూరి దేవయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతడి కుటుంబానికి దేవయ్యతో దండేపల్లి ఉన్నత పాఠశాలలో కలిసి చదువుకున్న 1984–85 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.36,500 నగదును దేవయ్య భార్య వసంతకు శనివారం అందించి, తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నూర తిరుపతి, అక్కల తిరుపతి, గోలి రవీందర్, ఎస్.లింగయ్య, బొలిశెట్టి దత్తయ్య, భూపతి, కానుగంటి చంద్రయ్య, లింగంపల్లి చంద్రయ్య, ఎర్రం నరసయ్య, రాజన్న శ్రీనివాస్, జె రాములు తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల సమావేశం

మందమర్రిరూరల్: మందమర్రి మండల కేంద్రంలోని ఎంపీడీవో ఆఫీస్‌లో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. అధికారులు వారి విభాగాలకు సంబంధించిన ప్రగతి నివేదికలు వివరిస్తుండగా, సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రభుత్వం ఇప్పటివరకు రైతులకు సంబంధించి పెట్టుబడి సాయం కింద అందించే రైతుబంధు డబ్బులు వేయలేదని, ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్టుగా రూ.లక్ష రుణమాఫీ చేయలేదన్నారు. దీనికి వ్యవసాయాధికారి రాజేశం స్పందిస్తూ ప్రభుత్వం దశల వారీగా రైతులకు సాయం చేస్తుందని, ప్రస్తుతం రెండు ఎకరాలు ఉన్న రైతుల ఖాతాలో అమౌంట్ పడిందన్నారు. గతేడాది మనఊరు-మనబడి కింద పనులు మొదలు పెట్టిన పాఠశాలల నిర్మాణాలు ఎందుకు నిలిచిపోయాయని, విద్యార్థులకు ఇబ్బంది అవుతుందని విద్యాశాఖ అధికారి జాడి పోచయ్యను నిలదీయగా నిధులు రాకపోవడంతో గుత్తేదారులు పనులు నిలిపివేశారని ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. అటవీ ప్రాంతంలోని పనుల విషయంలో అటవీశాఖ సిబ్బందితో కలిసి ఉపాధి హామీ పనులు చేపట్టాలని, అలాగే ఫాం ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి కేటాయించిన భూమికి సంబంధించి సదరు యజమాని డబ్బులు పే చేయలేదని తమ దృష్టికి వచ్చిందని సభ్యులు ప్రశ్నించగా యజమాని డబ్బులు పే చేస్తేనే భూమి కేటాయిస్తామని తహసీల్దార్ చంద్రశేఖర్ సమాధానం ఇచ్చారు. మండలంలో మరొక ఏఎస్ఎంను నియమించాలని, పంచాయితీ రాజ్ ఏఈ రాజశేఖర్‌కు అదనంగా కోటపల్లి మండల బాధ్యతలు కేటాయించడంతో మందమర్రి మండలంలో అభివృద్ధి పనులు నత్తనడకన జరుగుతున్నాయని, కోటపల్లి మండల విధులను తొలగించాలని, రసూల్‌పల్లి వెంకటాపూర్ మీదుగా ఆర్టీసీ బస్సు నడిపించాలని తీర్మానం చేశారు. ఎంపీపీ గుర్రం మంగ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ రాజ్‌కుమార్, జెడ్పీటీసీ వేల్పుల రవి, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రావు ఎంపీడీవో శశికళ, వైద్యాధికారి రమేష్, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో పోచయ్య

ఎలక్ట్రీషియన్ డే

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం ఎలక్ట్రీషియన్ డే ను ఘనంగా జరుపుకున్నారు. జెండా ఆవిష్కరించి విద్యుత్‌బల్బ్‌ను కనిపెట్టిన శాస్త్రవేత్త థామస్ అల్వాఎడిసన్‌ను స్మరించుకుని నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు ఠాకూర్ హిమ్మత్‌సింగ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేత

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో హజ్రత్ తాజుద్దీన్ బాబా రహ్మతుల్లాహ్ అలైహ్ 163వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. గ్రెస్‌మైనార్టీ సెల్ రాష్ట్ర మాజీ కో ఆర్డినేటర్ అన్వర్‌ఖాన్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. షంషీర్ నగర్‌లోని జిల్లా పరిషత్ ఉర్దూ మీడియం హైస్కూల్‌లో జయంతి వేడుకలను నిర్వహించారు. కాంగ్రెస్‌అసెంబ్లీ నియోజకవర్గ నాయకుడు నాతరి స్వామి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

యూటీఎఫ్ కార్యవర్గం

కాసిపేట: మండల టీఎస్ యూటీఎఫ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొని ప్రకటించినట్లు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జి.చక్రపాణి తెలిపారు. మండల అధ్యక్షుడిగా సీహెచ్. సునీత, ప్రధానకార్యదర్శిగా వేల్పుల కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా వి.రమేష్ తదితరులు ఎన్నికయ్యారు.

అ'పూర్వ' సమ్మేళనం



హాజరైన పూర్వ విద్యార్థులు

రామకృష్ణాపూర్: పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలకు చెందిన 1997–98బ్యాచ్ పూర్వ విద్యార్థులు శనివారం గద్దెరాగిడిలోని శ్రీనివాస్‌గార్డెన్స్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ చిన్ననాటి మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. సుమారు 80మంది పూర్వవిద్యార్థులు 25ఏళ్ల అనంతరం ఒకే వేదికపై కలుసుకోవడంతో వారివారి అనుభవాలను పంచుకుంటూ రోజంతా ఉత్సాహంగా గడిపారు.

మున్సిపల్ సమావేశం నిర్వహించాలి

బెల్లంపల్లి: ప్రజా సమస్యలపై చర్చించి తీర్మానాలు చేయడానికి వెంటనే మున్సిపల్ సాధారణ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని బెల్లంపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. కూటమిగా ఏర్పడిన 20మంది కౌన్సిలర్లు శనివారం మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, కలెక్టరేట్ ఏఓను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ.. బెల్లంపల్లి మున్సిపల్ సాధారణ సమావేశాలు గడిచిన మూడు నెలల నుంచి నిర్వహించడం లేదని తెలిపారు. సమావేశాలు నిర్వహించకపోవడంతో వార్డు సమస్యలు అపరిష్కృతంగా ఉంటున్నాయని, అభివృద్ధి కుంటుపడుతోందని పేర్కొన్నారు. ప్రతి వార్డుకు అభివృద్ధి నిధులు కేటాయించాలని, తొలగించిన కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, ప్రతి వార్డుకొక పర్మినెంట్ కార్మికుడిని నియమించాలని, చెత్త బండ్లను వార్డులకు పంపించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.



ఏవోకు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్లు

అక్రమ నిర్మాణాలు ఆపాలని ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న సభ్యులు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలో పలు అక్రమ కట్టడాలను నిలిపివేయాలని బహుజన రక్షణ సమితి అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్, రామిల్ల మురళి, జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో సర్వే నంబర్ 250లో అనుమతి లేకుండా పలువురు అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇష్టారాజ్యంగ నిర్మాణాలు చేపడుతుండగా మున్సిపల్ అధికారులు వాటికి ఇంటి నంబర్లు ఇస్తున్నారన్నారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

మహిళా సాధికారత సాధనపై అవగాహన

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగాన్ని శనివారం కళాశాల ప్రిన్సిపాల్ డి.సుమతి ప్రారంభించిన అనంతరం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. మహిళా సాధికారత సాధనకు పంచ సూత్రాలను వివరించడంతో పాటు, విద్యార్థినులు సామాజికంగా, ఆర్థికంగా, న్యాయపరంగా, రాజకీయపరంగా ఉన్నత స్థాయి చేరుకునేందుకు విద్యయే ప్రధాన సూత్రమని తెలిపారు. విభిన్న కళా నైపుణ్యాలను వెలికితీసే కార్యక్రమంలో భాగంగా పలు అంశాలలో నిర్వహించిన కళల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.శివలీల, మహిళా సాధికారత విభాగ సభ్యులు టి.కవితారాణి, స్వప్న సుదగోని, ప్రణవి, శైలజ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ సుమతి

నేడు కంకాలమ్మ కేతేశ్వర స్వామి జాతర

జన్నారం: మండలంలోని పొనకల్ గ్రామ సమీపంలో అటవీ ప్రాంతంలో చిన్న గుట్టపై బండరాళ్ల మధ్యన శ్రీ కంకాలమ్మ సమేత కేతేశ్వర స్వామి స్వయంభువుగా వెలిసారు. ప్రతీ సంవత్సరం మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో జాతర నిర్వహిస్తుండగా, 28న ఆదివారం 10వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ కేతేశ్వర కంకాలమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు జరిపి జాతర ప్రారంభిస్తారు. దాతల సహాయంతో అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నర్సింగరావు, వైస్ చైర్మన్ చిలువేరు నర్సయ్య తెలిపారు. పలువురి దాతల సహకారంతో ఆలయం వద్ద భక్తులకు సౌకర్యాలు కల్పించామని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి, స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఏటా మూడు రోజులు జాతర నిర్వహిస్తున్నట్లు, జగిత్యాల, కరీంనగర్, మంచిర్యాల జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారని పూజారి భూమయ్యస్వామి తెలిపారు.



ఈర్లగుట్టపై ఏర్పడిన కేతేశ్వర స్వామి ఆలయం

గ్రామీణ క్రీడాకారులు రాణించాలి

నెన్నెల: గ్రామీణ క్రీడాకారులు తమ ఆట తీరును మెరుగు పర్చుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఎస్సై శ్యాం పటేల్ అన్నారు. మండల కేంద్రంలో యూత్ ఆధ్వర్యంలో పుప్పాల రఘు జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఎంపీపీ రమాదేవితో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ టోర్నీలో వివిధ మండలాల నుంచి 42జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. క్రీడాకారులు మైదానంలో క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. ఓటమి, గెలుపునకు పునాది లాంటిందని, ఓడిపోతే తప్పులు సరి చేసుకొని గెలిచే ప్రయత్నం చేయాలన్నారు. క్రీడలతో శారీరక ధృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, ఐక్యత స్నేహాభావం పెంపొందుతుందన్నారు. ఇలాంటి క్రీడా పోటీల్లో గ్రామీణ క్రీడాకారులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయొచ్చన్నారు. గ్రామాల్లో యువత క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. నిర్వాహకులు మహేష్, సతీష్, సర్వర్ పాషా, ప్రకాశ్, సాయిలను ప్రత్యేకంగా అభినందించారు. త్వరలోనే పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తామన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని బ్యాటింగ్ చేసి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేష్, సర్పంచ్ కోట సుజాత, కో ఆప్షన్ సభ్యులు ఇబ్రహీం, ఎంపీటీసీ తిరుపతి, నాయకులు సాగర్ గౌడ్, రాంచందర్, ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎస్సై శ్యాం పటేల్